క్లుప్తంగా

వలంటీర్ల భర్తీకి ఇంటర్వ్యూలు


అభ్యర్థికి ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్‌ఎస్ ప్రసాద్

సీతానగరం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు ఎంపీడీఓ ఎంఎల్‌ఎస్ ప్రసాద్ ఆదివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూర్జ, కృష్ణారాయపురం, పెద భోగిలి గ్రామాల్లో విధులు నిర్వహించే వలంటీర్లు రాజీనామా చేయడంతో ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. ఈ మేరకు ప్రభుత్వం వలంటీర్ల నియామకానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించిందని చెప్పారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు అర్హులైన దరఖాస్తుదారుల సర్టిఫికెట్స్ పరిశీలించి ఇంటర్వ్యూ నిర్వహించినట్లు తెలిపారు. ఇంటర్వ్యూకు వచ్చిన వారి వివరాలు ఉన్నతాధికారులకు నివేదించిన అనంతరం ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు.

మాంసం విక్రయాలు చేపట్టరాదు

సాలూరు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం మాంసం విక్రయాలు చేపట్టరాదని మున్సిపల్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరు మాంసం విక్రయాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవన్నారు.

19న సర్వసభ్య సమావేశం

గుమ్మలక్ష్మీపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 19న ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులతో పాటు వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో విధిగా హాజరుకావాలని కోరారు.

వరుసలో నాటితే దిగుబడి మెండు


వ్యవసాయ కూలీలకు వరినాట్లు వేసే విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

జియ్యమ్మవలస: వరుస పద్ధతిలో వరినాట్లు వేసుకుంటే దిగుబడి పెరుగుతుందని, చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి బి.ధనుంజయ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంపై ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు. బీజామృతంతో వరినారును శుద్ధి చేసి వరుస పద్ధతిలో నాట్లు వేసుకోవాలని, దీని వల్ల మొక్క కుదుళ్లకు గాలి, వెలుతురు సమృద్ధిగాఅందుతాయని, పంట తెగుళ్ల ఉధృతిని నియంత్రించవచ్చని అన్నారు. ఫలితంగా పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ తాడేల మన్మథ నాయుడు, వ్యవసాయ సిబ్బంది త్రినాథ, సింహాచలం ఉన్నారు.

గ్రామదేవతకు ఆలయ నిర్మాణం


శ్లాబ్ పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ ప్రసాద్

భామిని: మండలంలోని నులకజోడు గ్రామదేవత చెవిటమ్మ తల్లి మందిర నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఆదివారం శ్లాబ్ నిర్మాణం పూర్తిచేశారు. సర్పంచ్ కొత్తూరు ప్రసాద్ పనులను పర్యవేక్షించారు. గ్రామస్తులందరి సహకారంతో గ్రామదేవత ఆలయం నిర్మాణం చేపడుతున్నామని ఆయన తెలిపారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

వీరఘట్టం: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఎం.వి.రమణ సూచించారు. ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కొంతమంది యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారని, తల్లిదండ్రులు పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. డ్రైవింగ్ లైసెన్సు లేని వారికి, మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దని సూచించారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



పట్టాల మధ్య దుర్గాప్రసాద్ మృతదేహం


దుర్గాప్రసాద్ (ఫైల్)

పార్వతీపురం టౌన్/పాలకొండ రూరల్: పార్వతీపురం పట్టణ రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం రైలు ఢీకొని ఓ యువకుడు మరణించాడు. ఈ ప్రమాదంపై ప్రభుత్వ రైల్వే పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం పట్టణంలోని బైపాస్ కాలనీలో నివాసం ఉంటున్న అమ్మమ్మ తూముల దుర్గమ్మ ఇంటికి వచ్చిన పాలకొండ మండలం అన్నవరం గ్రామానికి చెందిన గొట్టాపు దుర్గాప్రసాద్(19) ఉదయం రైల్వే స్టేషన్ వైపు వెళుతుండగా విశాఖ నుంచి రాయగడ వెళ్తున్న రైలు ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే మరణించాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

స్వతంత్ర సంగ్రామంలో
సాలూరు గుర్తులు

- సాలూరు ప్రథమ శాసనసభ్యుడు స్వతంత్ర్య సమరయోధుడు
- సాలూరు గాంధీగా కీర్తించబడిన కూనిశెట్టి వెంకట నారాయణ దొర




భారతదేశానికి స్వాతంత్ర్యం రావడంతో సాలూరులో నిర్వహించిన భారీ ర్యాలీ (ఫైల్)

సాలూరు: భారత స్వతంత్ర సంగ్రామంలో సాలూరుకు చెందిన యోధులు అలుపెరగని పోరాటాలు చేశారు. వారిలో కూనిశెట్టి వెంకటనారాయణ దొర, బెంజిమన్ ఫ్రాంక్లిన్, దారాముక్కల యగ్నేశ్వరశర్మ, తదితరులున్నారు. వీరిలో కూనిశెట్టి వెంకటనారాయణ దొర సాలూరు గాంధీగా పేరుగాంచారు. స్వతంత్ర కాంక్ష ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న ఆ రోజుల్లో సాలూరు సెంటర్‌లో వందేమాతర నినాదాలు చేసిన నారాయణదొరపై అంగ్లేయులు విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేశారు. అయినప్పటికీ వందేమాతర నినాదం ఆపకపోవడంతో ఆయన్ను బరంపురంలోని సీ క్లాస్ జైలులో సుమారు ఏడాదిన్నర ఉంచారు. జైలు నుంచి వచ్చిన తర్వాత కూడా గాంధీ పిలుపుమేరకు పోరాటం సాగించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 1947 ఆగస్టు 15న రోజున సాలూరు ప్రజలందరూ తమకిష్టమైన నారాయణదొరను గుర్రంపై ఊరేగించారు. అనంతరం 1952లో దేశవ్యాప్తంగా జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఆచార్య ఎన్‌జీ రంగా స్థాపించిన కృషికార్ లోక్ పార్టీ తరపున అఖండ మెజారిటీతో సాలూరు శాసనసభ్యుడిగా గెలిచారు.

15వ ఏట నుంచే..


1907 జూలై 4న కూనిశెట్టి యరకన్నదొర, సాయమ్మలకు తొలి సంతానంగా వెంకటనారాయణ దొర జన్మించారు. విలాసవంతమైన కుటుంబ నేపథ్యంలో జన్మించినప్పటికీ, భారత స్వాతంత్ర్య సమరంలో ఇంటికో యోధుడిని తయారుచేసి దేశానికి అంకితం చేయాలని దేశ ప్రజలు సంకల్పించిన రోజులలో తన 15వ ఏటే నారాయణదొర స్వతంత్ర సమరంలోకి అడుగులు వేశారు.

చరిత్రలో కొన్ని సంఘటనలు..

- 1922లో సాలూరులో సహాయనిరాకరణ ఉద్యమంలో భాగంగా కల్లు, సారా వేలం పాటలు జరుగకుండా నారాయణదొర నిషేధించారు. అలాగే విదేశీ వస్తు బహిష్కరణకు తోడ్పడ్డారు.
- 1930లో విశాఖపట్నంలో మహాత్మాగాంధీ అధ్యక్షతన జరిగిన ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నందుకు 6 నెలలు కఠిన కారాగార శిక్ష అనుభవించారు.
- 1932లో గుంటూరులో గాంధిజీ శిష్యురాలు వేదాంతం కమలాదేవి అధ్యక్షతన జరిగిన స్వాతంత్ర్య పోరాట సమావేశంలో దొర ప్రముఖ పాత్ర వహించినందుకుగాను బ్రిటీష్ వారు అరెస్ట్ చేశారు.
- 1936 నవంబర్ 14న ఓ సందర్భంలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రాణాలను దొర కాపాడారు.
- 1937లో సాలూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వందేమాతర నినాదాలు చేస్తున్న దొరపై ఆనాటి పార్వతీపురం డీఓఎస్పీ హామిల్టన్ లాఠీచార్జ్ చేయించారు.
- 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమానికి సాలూరు తరఫున నాయకత్వం వహించారు.

సత్కారం

అనేక ఉద్యమాలు, పోరాటాలలో పాల్గొన్న నారాయణదొరను భారత ప్రభుత్వం తామ్రపత్రంతో సత్కరించింది. సాలూరు నియోజకవర్గ తొలి శాసన సభ్యుడిగా ఎన్నికైన తర్వాత అనేక మంచి కార్యక్రమాలు చేసి నిస్వార్థ రాజకీయ నాయకుడిగా ప్రజల మనస్సుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు.


సాలూరులో జాతీయ జెండాను ఎగురవేస్తున్న వెంకటనారాయణ దొర (ఫైల్)

సచివాలయం ప్రారంభం


సచివాలయ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని గాదెలవలసలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రం భవనాలను ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం ప్రారంభించారు. సచివాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సర్పంచ్ చాంబర్‌లోని కుర్చీలో సర్పంచ్ అన్నపూర్ణమ్మను ఎమ్మెల్యే అలజంగి జోగారావు కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ మహాత్మాగాంధీజీ కన్న కలలు నిజం చేయాలన్న స్ఫూర్తితోనే ప్రజల చెంతనే ప్రభుత్వ పాలన సాగించాలన్న దక్షతతో సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థను తెచ్చి ప్రజలకు సేవలందించే విధంగా కార్యరూపం దాల్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు.

సువర్ణముఖి నదిపై బ్రిడ్జి నిర్మాణం

జిల్లాలో నాలుగునియోజకవర్గాలకు చెందిన 8 మండలాల ప్రజల చిరకాల కోరిక త్వరలో తీరనుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ ఆయన మాట్లాడుతూ మండలంలోని సువర్ణముఖినదిపై బూర్జ–గాదెలవలస, చినంకలాం రేవులో బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. త్వరలోనే బ్రిడ్జి సమస్య తీరనుందని తెలియ జేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రమణమ్మ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, సర్పంచ్ బి అన్నపూర్ణ, పీఏసీఎస్ చైర్మన్ బి సత్యనారాయణ, ఏఓ ఎస్.అవినాష్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బి.చిట్టిరాజు, బి శ్రీరాములునాయుడు, పంచాయతీ రాజ్ డీఈ ఎం.రత్నకుమార్, ఏఈ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పి.ఈశ్వరనారాయణ, టి.వెంకటప్పలనాయుడు, బి.శివకుమార్, ఆర్వీ పార్థసారథి, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- డిప్యూటీ సీఎం రాజన్నదొర


రాజన్న దొరను గజమాలతో స్వాగతం పలుకుతున్న స్థానిక ప్రజలు

పాచిపెంట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని కోటికిపెంట పంచాయతీలో కోటికిపెంట కోడికాళ్లవలస, గర్లెళ్లవలస గ్రామాల్లో ఎంపీడీఓ జి. పార్వతి అధ్యక్షతన స్థానిక సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు మాదల సత్యవతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సలాది అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పీడిక రాజన్నదొరకు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అలాగే స్థానిక సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్దగెడ్డ నిర్వాసిత గ్రామమైన కోటికిపెంటలో తమకు ఇళ్ల స్థలాలు కేటాయించలేదని నిర్వాసిత కుటుంబాలు తెలిపాయి. దీనికి మంత్రి స్పందిస్తూ 30 రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా గర్లెళ్లవలసలో కొంత మంది తమ భూమి ఆన్‌లైన్ కాలేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే రెవెన్యూ అధికారులు పిలిపించి భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ప్రమీల, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శులు డోల బాబ్జి, పాచిపెంట వీరంనాయుడు, వైస్ ఎంపీపీ కోరిపల్లి రవీంద్ర, మాజీ వైస్ ఎంపీపీలు తట్టికాయలు గౌరీశ్వరరావు, గండిపల్లి రాము, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

హోం మంత్రి పర్యటన విజయవంతం చేయండి

- అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత ఆగస్టు 14, 15వ తేదీల్లో పార్వతీపురం మన్యం జిల్లాలో అధికారికంగా పర్యటించనున్న నేపథ్యంలో నియోజకవర్గం పరిధిలో పలు కార్యక్రమాలలో పాల్గొంటారని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన చినబొండపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేశారు. హోం మంత్రి పర్యటనలో భాగంగా చినబొండపల్లి గ్రామంలో నూతన సచివాలయాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో అందుకు అవసరమైన ఏర్పాట్లను స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మొత్తం వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆమె పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీలు సిద్ధ జగన్నాథ రావు, బంకురు రవికుమార్, స్థానిక సర్పంచ్ గండి శంకరరావు, ఆత్మ చైర్మన్ వై.తిరుపతి రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బలగ నాగేశ్వర రావు, మజ్జి శేఖర్, భీమవరపు కృష్ణమూర్తి, వెంపలి గురురాజు, పీఏసీఎస్ చైర్మన్ కాపారావు సత్యనారాయణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పురస్కారాలు అభినందనీయం


మండల విద్యాశాఖ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సామల సింహాచలం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా నుంచి నాలుగు పాఠశాలలు రాష్ట్ర ప్రతిభా అవార్డులకు ఎంపిక కావడం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల సీతంపేట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జియ్యమ్మవలస, భద్రగిరి ఏపీ గర్ల్స్ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్, రేగులపాడు కేజీబీవీ రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. రాష్ట్రస్థాయిలో ఎనిమిది పాఠశాలలను ఎంపిక చేశారని, అందులో నాలుగు పాఠశాలలు పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఎంపిక కావడం గొప్ప విషయమని చెప్పారు. ఉత్తమ పాఠశాలలుగా ఎంపిక కావడానికి కృషి చేసిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సిబ్బందికి ఎంఈఓల సంఘం తరపున అభినందనలు తెలియజేస్తున్నామని చెప్పారు.

స్వాతంత్ర్య దినోత్సవ రిహార్సల్


రిహార్సల్ చేస్తున్న పోలీసు అధికారులు

పార్వతీపురంటౌన్: స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, ఆర్డీఓ హేమలతలు సూచించిన మేరకు అన్ని శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. ఈ మేరకు ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం పరేడ్ కసరత్తు ప్రారంభించారు. జాతీయ పతాక ఆవిష్కరణకు ముందు, తరువాత చేయనున్న కసరత్తు, మైదానంలో పరేడ్ నిర్వహణపై ట్రయల్‌రన్ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వరరావు, ఆర్ఐలు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వివిధ శాఖలకు సంబంధించి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి అదేశాల మేరకు శకటాలు ఏర్పాట్లలో డ్వామా, హౌసింగ్, వ్యవసాయ–ఉద్యాన శాఖ, విద్య, వైద్య, ఐటీడీఏ, వెలుగు, జీసీసీ, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మన్యం జిల్లాలో రెండో ఏడాది జరిగే స్వాతంత్ర దినోత్సవాన్ని దిగ్విజయంగా నిర్వహించేందుకు జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్, ఎస్పీలు కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, డీఎస్పీ బలివాడ నాగేశ్వర రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న రాకపోకల సమస్య

- లచ్చయ్యపేట–గుమ్మిడివరం మధ్య కల్వర్టు


కల్వర్టు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ కృష్ణ, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట–గుమ్మిడివరం గ్రామాల మధ్య కల్వర్టు నిర్మాణం జరుగుతుండడంతో ప్రజలకు రాకపోకల సమస్య తీరనుందని జెడ్పీటీసీ ఎం. బాబ్జీ, సర్పంచ్ సీహెచ్ కృష్ణ అన్నారు. ఈ మేరకు లచ్చయ్యపేట సమీపంలో ఆదివారం కాలువ, కల్వర్టు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో లచ్చయ్యపేటకు మధురగ్రామమైన గుమ్మిడి వరం వెళ్లే రహదారిలో కల్వర్టు శిథిలమైపోవడంతో వర్షాలు కురుస్తున్న సమయంలో రెండు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడడమే కాకుండా శ్మశాన వాటికకు మృతదేహాలను తరలించడానికి రహదారి లేక అవస్థలు పడాల్సి వస్తోందని, రహదారి సమస్య తీర్చాలని కోడంవల్ల కల్వర్టు నిర్మాణం, శ్మశాన వాటికకు వెళ్లడానికి రహదారి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

పింఛన్ దారులు నెలవారీ సమావేశానికి హాజరుకావాలి

పార్వతీపురంటౌన్:

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పింఛన్ దారుల సమావేశ భవనంలో జాతీయ పతాకావిష్కరణ ఉదయం 9 గంటలకు జరగనున్నందున ఉదయం 8.30 గంటలకు పార్వతీపురం ట్రెజరీ పరిధిలో గల పింఛన్ దారులు హాజరుకావాలని సంఘం కార్యదర్శి డి.గణపతి రావు కోరారు. అనంతరం ఉదయం 10 గంటలకు యథావిధిగా నెలవారీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. కావున పింఛన్ దారులందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

గడపగడపకు కార్యక్రమంతో గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే జోగారావు


లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఒక్క కుటుంబానికీ సంక్షేమ పథకాన్ని అందించడమే కాకుండా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పాలిస్తోందని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. బలిజిపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించిన సందర్భంగా ప్రజలతో మమేకమై వారి అవసరాలను గుర్తిస్తూ, ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అనేది తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్‌మోహన్ రెడ్డికి రెండు కళ్లు అని అన్నారు. నవరత్నాలు లాంటి పథకాలను ప్రవేశపెట్టి ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలను అందించిన గొప్ప నాయకుడని కొనియాడారు. 2024ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించుకుని జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా చేయాలని ప్రజలను కోరారు.

ప్రభుత్వం ఇంకా మెరుగైన పాలన అందించేందుకు ఏం చేయాలనేది ప్రజలను అడిగి తెలుసుకుంటున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘలత, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, బి.సత్యనారాయణమూర్తి, బలిజిపేట ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు ఆర్.శ్రీనివాసరావు, జగన్, జి.సత్యంనాయుడు, రమణ, టి.ప్రసాద్, ఎ.పోలినాయుడు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నా అడుగు మీ కోసానికి ప్రజాదరణ

పార్వతీపురంటౌన్: 'నా అడుగు మీ కోసం' కార్యక్రమానికి మంచి ప్రజాదరణ లభిస్తోందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం 4వ రోజు కుసుమ దంగిడ వీధి, చినదేవర వీధి, కంచర వీధి, కాకర్ల వీధి, కొత్త వీధి, గడి వీధుల్లో 28, 2వ వార్డులలో గుర్తించిన పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో పాటు ఆయన దృష్టికి తెచ్చిన స్థానిక ప్రజల వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టారు. ఈ సరికొత్త కార్యక్రమం ద్వారా అన్ని వార్డులను సందర్శించి ప్రజలకు అవసరమైన శానిటేషన్, కాలువలు, రోడ్లు, మంచి నీరు సరఫరా, వీధులు పరిశుభ్రత వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నదీ లేనిదీ తెలుసుకుని సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్ పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ ఇండుపూరు గున్నేశ్వర రావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్‌లు మజ్జి శేఖర్, యడ్లత్రినాథ, మంత్రి ఉమామహేశ్వరి, రణభేరి చిన్నంనాయుడు, రణభేరి బంగారు నాయుడు, సువ్వాడ లావణ్య, పట్టణ జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ శానిటరీ ఉద్యోగులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం


ప్రకృతి సాగులో వినియోగించే కషాయాలను చూపుతున్న సీఆర్‌పీ, రైతులు

భామిని:

నవధాన్య పంటల సాగుతో భూమిలో సేంద్రియ కర్బన శాతం పెరుగుతుందని, పంటకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా అందుతాయని ఏపీసీఎన్ఎఫ్ సీఆర్‌పీ వలరౌతు ప్రభాకర్ అన్నారు. మండలంలోని నులకజోడు, ఘనసర, నేరడి–బి గ్రామాల్లో ఆదివారం రైతులతో సమావేశమై ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. బీజామృతంతో వరినారు శుద్ధి చేసి, నారు మొనలను తుంచి వరుసలో నాటుకోవాలి. చిగుళ్లను తుంచి నాటడం వల్ల కాండం తొలుచుపురుగు ఉధృతిని నివారించవచ్చు. పొలం గట్టుపై కంది, బంతి, కూరగాయ మొక్కలు వేసుకోవడం ద్వారా ఎర పంటగా ఉపయోగపతాయని వివరించారు. పంటలో చీడపీడల నివారణకు వినియోగించాల్సిన కషాయాల తయారీ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు కె.సంధ్య, బి.భాగ్యలక్ష్మి, సోంబ్రో పాల్గొన్నారు.